


# లెట్ గో

- ఆకెళ్ళ కృష్ణకుమారి

"అమ్మా! నాకు కంపెని CEOగా డెట్రాయిట్‌లోనే ఉద్యోగము వచ్చింది. మేము వచ్చే నెలలో అక్కడికి వస్తున్నాము", అని ఫోను చేసాడు ప్రభాకర్. ఈ మాట విని రుక్మిణి చాలా సంతోషంతో భర్తకు చెప్పటానికి వెళ్ళింది. అవును మరి, ఇన్నాళ్ళకు కొడుకు కోడలు , పిల్లలతో వాళ్ళ ఊరికే వస్తున్నారంటే సంతోషమే కదా మరి.

రుక్మిణి, కృష్ణమూర్తిలకు ఒక కొడుకు ప్రభాకర్, ఒక కూతురు లలిత. లలితకు పెళ్ళి అయి భర్త, ఇద్దరు పిల్లలతో కాలిఫోర్నియాలో ఉంటోంది. కొడుకు ప్రభాకర్, కోడలు లక్ష్మి ఆస్టిన్‌లో ఉంటున్నారు వాళ్ళకు ఇద్దరు పిల్లలు - 9 సంవత్సరాల వినోద్, 7 సంవత్సరాల సరిత. కృష్ణమూర్తి ప్రొఫెసర్‌గా రిటైర్ అయి, ఇంటినించి కన్సల్‌టెంట్‌గా పని చేస్తున్నాడు. అప్పుడప్పుడు వెళ్ళి పిల్లల్ని చూసుకుని, మనవలతో గడిపి వస్తుంటారు.

"మనము కూడా పెద్దవాళ్ళమౌతున్నాము. మనకు ఒక ఎకరం స్థలంలో పెద్ద ఇల్లు ఉంది కదా. ఈ స్కూలు డిస్ట్రిక్ట్ కూడా పిల్లలకు మంచిది. అందుకని ప్రభాకర్ వాళ్ళు కూడా మనతోనే ఉంటే బాగుంటుంది కదండీ" అంది రుక్మిణి.

"మనకు బాగుంటుంది, సరే. కాని వాళ్ళకు కూడా నచ్చాలి కదా" అన్నాడు కృష్ణమూర్తి..

"మీరు గట్టిగా చెబితే వాళ్ళు తప్పకుండా ఒప్పుకుంటారు. మీరు చెప్పండి " అంది రుక్మిణి.

ఆయన వెంటనే కొడుకుని పిల్చి ఈ మాట చెప్పాడు.

ప్రభాకర్, లక్ష్మి కూడా, "తాత, మామ్మల దగ్గిర వుంటే పిల్లలకు బాగుంటుంది. అమ్మ, నాన్న పెద్దవాళ్ళు అవుతున్నారు. మనం వాళ్ళతో వుంటే వాళ్ళకు సహాయంగా వుంటుంది" అని ఆలోచించి, వాళ్ళతోనే వుండాలని నిశ్చయం చేసుకున్నారు. ఆ మాట వాళ్ళతో చెప్పారు.

ఇంక రుక్మిణి ఇల్లంతా సర్దటం మొదలు పెట్టింది. కొడుకు, కోడలుకు ఒక గది, పిల్లలకు ఒక గది తయారు చేసింది. పిల్లలకు చదువుకోవటానికి, ఆడుకోవటానికి , వాళ్ళ బొమ్మలు, పుస్తకాలు పెట్టుకోవటానికి ఒక గది ఏర్పాటు చేసింది. కొత్త పుస్తకాలు, బొమ్మలు కొని పెట్టింది.

ప్రభాకర్, కుటుంబం వచ్చే రోజుకి ఇల్లంతా తయారుగా వుంది. వాళ్ళు రాగానే అన్నీ చూసి చాలా సంతోషించారు. రాగానే, పిల్లల్ని దగ్గిరలో ఉన్న స్కూల్లో చేర్చారు. స్కూల్ బస్సు ఏర్పాటు చేసారు. ఇంట్లో అన్ని సామాన్లు వున్నాయి కనుక ఏమీ వెతుక్కోనక్కర

లేకుండా, తొందరగా అందరూ సెటిల్ అయారు. ప్రభాకర్ ఆఫీసు ఇంటికి 15 నిమిషాలు, డ్రైవ్ చేసే దూరంలో వుంది. లక్ష్మి కొన్నాళ్ళు ఇంట్లోనే ఉండి, తర్వాత మెల్లిగా ఉద్యోగం వెతుక్కోవాలని అనుకుంది.

పిల్లలు వచ్చేటప్పటికి ఇంటి వాతావరణమే మారిపోయింది. పిల్లలు తాత, మామ్మల దగ్గిర బాగా అలవాటయ్యారు. రుక్మిణికీ, కృష్ణమూర్తికీ పిల్లలతోనే కాలక్షేపం, లక్ష్మి అన్ని పనులలోను సహాయంగా ఉండటంతో రుక్మిణికి పని చేసినట్లే ఉండటంలేదు. రానురాను లక్ష్మి ఇంటి బాధ్యతలన్నీ తీసుకోవటం మొదలు పెట్టింది.

రోజూ రుక్మిణే వంట చేసేది. వేపుడు కూరలు, పచ్చళ్ళు, సాంబారు, అందులో నంజుకోవటానికి నూనెలో వేయించిన అప్పడాలు, వడియాలు, అన్నీ చేసేది. ఇది చూసి, ఒక రోజు లక్ష్మి అంది." అత్తయ్యా, నూనెలో వేయించిన పదార్థాలు ఎక్కువ తింటే మంచిదికాదు, కొలస్ట్రాల్ ఎక్కువౌతుంది, అని చెబుతున్నారు డాక్టర్లు. అన్నం కూడా ఎక్కువ తినటం మంచిది కాదుట. నేను చపాతీలు చేస్తాను, నూనె తక్కువ వేసినవి, ఉడకబెట్టినవి కూరలు చేస్తాను. అవి మనందరికీ మంచివి కదా" అని.

కాని రుక్మిణి వెంటనే, "రోజుకి ఒకసారేకదా అందరం సరిగ్గా భోజనం చేసేది. అన్నీ చక్కగా చేసుకుని తినకుండా ఈ పత్యం భోజనం ఎందుకమ్మా" అని కొట్టేసింది.

"ఒక మెయిడ్‌ని పెట్టుకుందాము.. చక్కగా వారానికి గాని, 15 రోజులకు గాని ఒకసారి వచ్చి, ఇల్లంతా శుభ్రం చేస్తుంది బట్టలు ఇస్త్రి చేస్తుంది" అని సలహా చెప్పింది లక్ష్మి.

కాని "మన పని మనం చేసుకుంటేనే హాయి. బైటవాళ్ళు, వచ్చి ఇంట్లో పని చేస్తే నాకు నచ్చదమ్మా" అంది రుక్మిణి.

వినోద్, సరిత మామ్మ దగ్గిర కథలు చెప్పించుకుని వినేవారు. వాళ్ళకి రామాయణం, భాగవతంలో కథలు చెప్పేది. రుక్మిణి. వాళ్ళకు తెలుగు నేర్పాలని చాలా సరదా పడేది. కాని వాళ్ళు కొన్నాళ్ళు నేర్చుకుని మానేశారు.

ఒక రోజు సరిత "నా ఫ్రెండ్స్ ఎవరికీ నాలాగ పొడుగు జుట్టు లేదు, నేను కూడా వాళ్ళ లాగ జుట్టు కత్తిరించుకుని పొట్టి జుట్టు పెట్టుకుంటాను " అని వాళ్ళ అమ్మ, నాన్నలతో చెప్పింది. పిల్ల సరదా పడుతోంది కదా అని వాళ్ళు సరే నన్నారు. కాని రుక్మిణికి ఇది నచ్చలేదు. "ఆడపిల్ల చక్కటి పొడుగు జుట్టుతో జడ వేసుకుంటే లక్షణంగా వుంటుంది. జుట్టు కత్తిరించుకోవట మేమిటి? అలా వద్దు" అనేసింది. లక్ష్మికి ఏమి చెయ్యాలో తోచలేదు. చివరకు మెల్లిగా సరితకే "కొన్నాళ్ళ తర్వాత మామ్మని ఒప్పించి చేయిస్తాను" అని నచ్చచెప్పి అప్పటికి సముదాయించింది.

ఇంతలో ఎండాకాలం వచ్చింది. "మనకు చాల స్థలం ఉందికదా. ఇందులో కూరలు పండిస్తే చక్కగా తాజా కూరలతో వంట చేసుకోవచ్చు" అని సరదా పడింది లక్ష్మి.

కాని " ఆ కూరమొక్కలకి బాగా ఎరువులు వేయాలి. మధ్యమధ్యలో పురుగులు పట్టకుండా స్ప్రే కొట్టాలి. ఎందుకొచ్చిన గొడవ ఇదంతా? వాటి బదులు కుండీలలో చక్కగా మందార, మల్లెలు లాంటి పూలమొక్కలు, ఇండోర్ ప్లాంట్స్ పెట్టుకుంటే దేవుడి పూజకి పూలు వస్తాయి, ఇంట్లోను అందంగా వుంటుంది " అనేసింది రుక్మిణి. లక్ష్మి చిన్నబుచ్చుకుంది.

లక్ష్మి ఒక రోజు, "మనము ఇప్పుడు ఎక్కువమందిమి అయాంకదా శామ్స్ క్లబ్‌లో సామాను కొనుక్కుంటే చవకగా వుంటుంది. అలా తీసుకురానా" అని అడిగింది. కాని రుక్మిణికి పక్కనున్న సేఫ్‌వే లో తెచ్చుకోవటమే అలవాటు. అందుకని ఈ ఆలోచన నచ్చలేదు.

ఏమీ చెయ్యలేక ఊరుకుంది కాని లక్ష్మికి ఇలా ప్రతిదానికి తనే సర్దుకోవాలంటే కష్టంగానే వుంది.

ప్రభాకర్‌కి మొదట్లో కంపెనీలో ఉద్యోగము బాగానే వుంది , కాని రానురాను అందులో చికాకులు రావటం మొదలుపెట్టాయి. బాగా అలిసిపోయి ఇంటికి వస్తుండేవాడు.

ఒకరోజు అలాగే అలసటగా, చికాకుగా ఇంటికి వచ్చిన కొడుక్కి కాఫీ ఇచ్చి , పక్కన కూచుని అడిగింది తల్లి. "ఏమి నాయనా ! ఎందుకని ఇలా చికాకుగా వున్నావు ? ఏమి అయింది ?" అని.

దానికి ప్రభాకర్ , "చూడమ్మా, మా ఫౌండర్ చైర్మన్ ఏమి చేస్తున్నాడో. అయనకి పని బరువు తగ్గించుకోవాలని, ఆయనే కావాలని నన్ను ఇక్కడికి తీసుకువచ్చాడు. కంపెనీ పైకి రావాలని, బాగా లాభాలు రావాలని, అలా చేసే సమర్థత నాకుందని నమ్మి నన్ను తీసుకువచ్చాడు. ఇప్పుడేమో, నేను కంపెనీకి మంచిదని పనిలో ఏ మార్పు చేసినా, అలా కాదు పాత పద్ధతిలోనే జరగాలంటాడు. అలా అయితే కంపెనీ ఇదివరకటిలాగే వుంటుంది. కొత్త లాభాలు వచ్చి వృద్ధిలోకి ఎలా వస్తుంది? అప్పుడు నన్నెందుకు తీసుకువచ్చినట్లు? నాకు తగిన స్వేచ్ఛ ఇచ్చి, నా పద్ధతులతో చేయనిస్తే కంపెనీని బాగా వృద్ధిలోకి తీసుకురావచ్చునుకదా అని నా బాధ. అవసరమైతే నేనే అయన్ని సలహా అడుగుతానుకదా.. ఆ నమ్మకం ఆయనకు వుండవద్దా!? " అని తన బాధంతా చెప్పాడు ప్రభాకర్.

ఇదంతా విని "అవునురా. మీ చైర్మన్‌కి నీ సమర్థత లో నమ్మకం వున్నా, బాధ్యత నీకు అప్పగించి, పక్కకు తప్పుకోవటం చేతకావటం లేదు లాగుంది. జీవితంలో ఒక వయస్సు, ఒక పొజిషన్ వచ్చిన తర్వాత సమర్థులైన చిన్నవాళ్ళ మీద నమ్మకంతో, వాళ్ళకు పని వదిలివేసి అవసరమై, వాళ్ళు అడిగితేనే సలహా ఇవ్వటం నేర్చుకోవాలి. ఆ వదులుకోవటం (letting go) చాలా, చాలా ముఖ్యం . అది ఆయనకు చేతకావటం లేదు కాబోలు" అని విమర్శించింది. ఈ సంభాషణంతా మౌనంగా వింటూ కూర్చున్నాడు కృష్ణమూర్తి.

ఆ మర్నాడు తీరికగా కూర్చుని రుక్మిణిని పిల్చి ఇలా చెప్పాడు కృష్ణమూర్తి, "రుక్మిణి, నిన్న నువ్వు అబ్బాయితో మాట్లాడినప్పుడు చాలా ముఖ్యమైన విషయం ఒకటి చెప్పావు. అది నాకు చాలా నచ్చింది. అది ఆ "వదులుకోవటం" అన్న విషయం. నేను కూడా కొన్ని రోజులుగా మన ఇంట్లో ఒక సంగతి గమనిస్తున్నాను. నువ్వు అబ్బాయి, కోడలు పిల్లలు ఇంట్లో మనతోనే వుండాలని సరదా పడ్డావు. "కాని వాళ్ళు వచ్చి ఉన్నప్పుడు, వాళ్ళ ఆలోచనలు, పద్ధతులు, మనం కూడా అర్థం చేసుకోవాలి, వాళ్ళు కూడా ఇంట్లో స్వతంత్రంగా, వాళ్ళకు కావలసినట్లుగా కూడా ఉండేటట్లు చూసుకోవాలి, అప్పుడే మనమందరము హాయిగా ఉండవచ్చును", అన్న విషయం ఆలోచించినట్లు లేదు.

అదృష్టవశాత్తు మనకు కోడలు బాధ్యత తెలిసినది, సమర్థురాలు, మంచిపిల్ల. నువ్వు లక్ష్మి మీద నమ్మకంతో, తన నిర్ణయాలకు కొన్ని పనులు వదిలివేస్తే, నీకు బరువు తగ్గుతుంది, వాళ్ళకు బాగుంటుంది. మన జీవితం హాయిగా గడుస్తుంది అనిపిస్తోంది. అవసరమైతే లక్ష్మే నిన్ను సలహా అడుగుతుంది. నిన్న నువ్వు చెప్పిన ఆ "వదులుకోవటం" అన్నది మన జీవితంలో కూడా ఆచరణలో పెడితే బాగుంటుందేమో ఆలోచించు" అని.

ఆ క్షణంలో అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న కృష్ణుడిలాగ కనిపించాడు, రుక్మిణికి కృష్ణమూర్తి.

●●●

**Click here to share your comments on this story**